# అక్కరకురాని ఆశయాలు

కాకాని కృష్ణమోహనరావు

కథానిక

"హైస్కూల్లో వార్షికోత్సవం ఎట్లా జరిగింది జానకీ?" అన్నాను, అప్పుడే ప్రవేశిస్తున్న జానకిని చూస్తూ

"బాగానే జరిగింది" అంది జానకి, మరో కుర్చీమీద కూర్చుంటూ

"అవునులే! అందులో మనకి ఒకపాత్ర వున్నప్పుడు అన్నీ బాగానే వుంటాయి" అన్నాను, పత్రికలోకి దృష్టి మరలిస్తూ

"నేను సభలో పాడానని నీకంత కోపమెందుకు బావా? నీవు కాలేజీలో నాటకాలేస్తే లేనిది " ఏడుపుమొహం పెడుతూ అంది జానకి

"ఏమిట్రా! ఎప్పుడూ ఒకటే పోట్లాట?" అంటూ హాల్లోకి ప్రవేశించింది అత్తయ్య.

"చూడత్తా! నీ కూతురు సభలో పాట పాడిందని నాకు కోపమట" అన్నాను జానకివైపు జూచి నవ్వుతూ

"లేకపోతే చూడమ్మా! మళ్ళీ కాలేజీలో వుపన్యాసాలిస్తాడు-స్త్రీకి నాగరికత అత్యవసరమంటూ! సరేగాని, ఒక గుడ్ న్యూస్—"

నాకుతెలును ఆ 'గుడ్ న్యూస్'—బహుశా వాళ్ళింట్లో ఏ పిల్లో ఈని వుంటుంది

"మీఇంట్లో కుక్కలేమీ లేనట్లున్నాయి కడుపుతో" అన్నాను సందేహంగా

"కాదులే! నన్ను మా హైస్కూలు తరఫున పాటల పోటీకి పంపిస్తున్నారు" అంది జానకి విజయగర్వంతో

నేను కొంచెం త్రుళ్ళిపడ్డాను. కారణం, ఇంతవరకూ మా కుటుంబంలోని స్త్రీలు ఎవరూ ఇతర పట్టణాలలో జరిగే సభలలో పాల్గొనలేదు అందువల్ల ఆ వార్త నాకు ఎంత సంతోషం గలిగించినా కొంచెం భయపడ్డాను, పెద్దవాళ్ళు దీని కేమంటారోనని.

"వెరీ గుడ్ న్యూస్! మరి డిన్నరెప్పుడిస్తావు!" అన్నాను ఉత్సాహంగా

"డిన్నరేముంది? ఈ పూటకి ఇక్కడ భోజనం చెయ్యాలి" అంది జానకి నవ్వుతూ

"నాకు ఒక్కడికీ భోజనముతో పోనిస్తాననుకొన్నావా? తప్పకుండా డిన్నరివ్వాలిసిందే" అన్నాను పట్టుదల చూపిస్తూ

"డిన్నరు సంగతి నాన్నగారికి రికమెండు చేస్తాగాని తమరీపూట కిక్కడ భోంచేసి సంతృప్తిపడండి" అంది జానకి లోపలికెళుతూ ఎట్లాగైతేనేం భోజనం చేయకుండా వదలింది గాదు జానకి ఆ మాటా ఈ మాటా అయేసరికి రాత్రి పది అయింది ఇంట్లోకి వెళ్తూ వుంటే వరండాలో నాన్నగారు "ఎక్కడికి వెళ్ళావు?" అన్నారు పేపరు పైనుంచి చూస్తూ. "మామయ్యగారింటికి" అన్నాను మెల్లిగా వెళ్తూ వెనకనుంచి ఆయనగారి గొణుగుడు వినిపించింది, "ఇట్లాగైతే చదివినట్లే"నని క్షణంసేపు తెల్లపోయాను అర్ధరాత్రివరకు స్నేహితుల రూములదగ్గరుండి, "మామయ్యగా రింటినుంచి వస్తున్నాను" అనగానే మాట్లాడకుండా వూరుకునే నాన్నేనా అనిపించింది మాట్లాడకుండా వంటింట్లో కెళ్ళాను అమ్మ ఏవో సర్దుతూ "అన్నం వడ్డించనా?" అంది "మామయ్యగారింటివద్ద భోంచేశాను" అన్నాను మాట్లాడకుండా తన పని చూసుకుంటూ వుండిపోయింది అమ్మ

• • •

ఈ నాలుగు నెలలలో జానకి ఎన్నో సభలలో పాడింది ఇంకా ఎన్నో సభలనుంచి ఆహ్వానాలొస్తున్నాయి. సహజంగా ఆమె అట్లా వెళ్ళడం అత్తావాళ్ళకు ఇష్టం లేకపోయినా, నా బలవంతాన అంగీకరించేవాళ్లు కాని నాన్నగారి సంగతే నన్ను బాధించేది

ఎప్పుడన్నా జానకి సంగతి వస్తే అదివరకు ఎంతో ఆదరణగా మాట్లాడే నాన్నగారు ఇప్పుడు మొహం తప్పించడం ప్రారంభించారు

ఆ రోజు కాలేజీనుంచి వచ్చి బట్టలు మార్చుకుంటూంటే ప్రక్క గదినుంచి మాటలు వినిపించాయి మాటలు బిగ్గరగా వినిపిస్తే వినక తప్పలేదు

“నీవు ఎన్నైనాచెప్పు రామారావ్! ఈ సంబంధం ఏవిధంగానూ సాగదు,” అంటున్నారు నాన్నగారు.

“నీవు ఎలాగో చూడు బావా! లేకపోతే చిన్నప్పటినుంచి కలిసి మెలిసి మెలిగిన వాళ్ళిద్దరి జీవితాలూ భగ్నమవుతాయి” మామయ్య గొంతుక అది,

“లాభంలేదు వాడికే అసలు ఇష్టంలేదు” నాన్నగారి గొంతు కఠినంగా పలికింది

“ఐనా జానకేం తప్పుజేసింది? సభలలో పాటలు పాడడమేగా దాని తప్పు?. .”

త్రుళ్ళిపడ్డాను జానకి సంగతీ, నా సంగతా వీరు మాట్లాడుతున్నది స్థాణువులాగా నిలుచుండిపోయాను చివరికి మామయ్య అరుస్తూ “నా కూతురికి పెండ్లి కాకపోదు” అంటూ వెళ్ళిపోతున్నప్పుడు వాస్తవపరిస్థితి లోనికి వచ్చాను

ఆరాత్రి భోజనాలవద్ద అసలు విషయం వచ్చింది, నాన్నగారు ఉపన్యాసమిస్తున్నారు, మా వంశ ప్రతిష్ట ఎంత గొప్పదయిందీ, దాన్ని ఆయన ఏవిధంగా నిలుపబోతున్నదీ నేను అమ్మవంక చూశాను బి ఏ. చదివిన నాన్నగారే ఇలా అంటూంటే, ఐదవ తరగతివరకే చదువుకున్న అమ్మ ఏమంటుంది?

“నేను జానకిని చేసుకుంటే మన వంశ ప్రతిష్టకేం లోటు నాన్నా?” అన్నాను ఉద్రేకం ఆపుకోలేక

కొరకొర చూశారు నావంక

“లోటా? ఒక బోగం పిల్లని తెచ్చుకుంటే ఎంత అవమానమో అంత అవమానం!” కోపంలో యుక్తాయుక్త విచక్షణ మరచిపోయారనుకుంటా

“సభలలో పాడినంత మాత్రాన ఎవరూ బోగం పిల్లలవరు నాన్నా” నేనూ కోపంగానే అన్నాను

“నాకు బుద్ధులు గరువుదామనుకుంటున్నావా,ఈనాటికి?” వ్యంగ్యంగా ప్రశ్నించారు

“అలా ఎవరూ అనుకోరు నాన్నా! తప్పుదారిని వెళ్తూంటే సరిదిద్దు దామనుకుంటారు”

“నాకేం అవసరంలేదు మన ఇంట్లోకి అటువంటి వ్యక్తి రావడానికి వీల్లేదు” ఖండితంగా చెప్పారు.

“జానకి సంగతి మీకూ తెలుసుగా నాన్నా! ఆమె మన వంశానికి అప్రదిష్ట తెచ్చేవని ఏమి చేస్తుంది?” అన్నాను బాధగా

“ఏమి చేస్తుందో నాకనవసరం నీ ఇష్ట మొచ్చినట్లు చేసుకో ఇంక నేనెందుకు?”

సగం భోజనంలో చెయ్యి కడుక్కొని కోపంగా వెళ్ళిపోయారు. నాన్నగారికి బాగా తెలుసు, ఎక్కడ కొడితే నాకు గాయం కలుగుతుందో నేనూ అక్కడనుండి లేచాను సగం భోజనంలో లేచిపోతున్న మమ్మల్నిద్దరినీ తెల్లపోయి చూస్తూ కూర్చుండిపోయింది అమ్మ

* * *

ఆరోజు సాయంత్రం పార్కుకు వెళ్దామని బయలుదేరాను. ఏదో ఆలోచించుకుంటూ నడుస్తున్నాను చివరికి తలెత్తి చూసేసరికి మామయ్యగారింటి ముందున్నాను మెల్లిగా లోపలికి వెళ్ళాను. జానకి ఒక సోఫాలో కూర్చుని గడ్డంక్రింద చెయ్యిపెట్టుకుని ఏదో ఆలోచిస్తున్నది. నన్ను చూచి లేచి మాట్లాడకుండా కుర్చీ చూపించింది.

ఇద్దరం కొంతసేపు నిశ్శబ్దంగాకూర్చున్నాం.

“నన్ను గురించి ఇంకా నీ వుద్దేశము ఇదేనా బావా?” అంది జానకి మెల్లగా

“ఏమిటి?” అన్నాను

“నేను దేశంవెంట తిరుగుతాననీ సరిగా కాపురం చేయననీ మామయ్యతో అన్నావటగా?”

తెల్లపోయాను. నాన్నగారు ఇంత తేలికగా తప్పు నా మీద పెడతారని గ్రహించలేక

పోయాను ఇప్పుడు ఆ భావాలన్నీ నాన్నగారివని చెబితే జానకి నమ్ముతుందా? అసలు నేను నాన్నగారిమీద ఆ తప్పు పెట్టగలనా?

"అసలు సంగీతం నీ కిష్టమనే నేర్చుకున్నాను నీ కోసం పెంచిన లతను నువ్వే త్రుంచేస్తావా బావా?" గాద్గదికంగా అంది జానకి. నేను మాట్లాడలేదు.

"ఒక సభకు పిలిచినా వెళ్ళనందుకు నీకు నా మీద కోపమొచ్చింది అందుచేత ప్రతి సభకూ వెళ్లేదానిని గాని, సహజంగా నేను మనసులో ఎంత బాధ పడేదానినో నువ్వు గ్రహించలేదు" నేలవైపుచూస్తూ అంది జానకి

"లేదు జానకీ! నిన్నుగురించి నాకేమి అనుమానంలేదు నాన్నగారూ...."

"ఎందుకు అనవసరంగా మామయ్యమీద పెడతావా దోషాన్ని? ఐనా జీవితంలోకి ప్రవేశించకుండానే కొంత అనుభవం కలిగిందిలే, ఆశయాలు ఆచరణకు పనికిరావని" జానకి రెండు చేతులతోనూ మొహం కప్పుకుని ఏడుస్తూ లోనికెళ్ళి పోయింది. నాకు తెలుసు ఆకన్నీళ్ళవెనుక ఎన్ని అగ్నిపర్వతాలున్నాయో! కాని నేను నాన్నగారిని వ్యతిరేకించగలనా? నా ఆశయాలు జానకిలో ప్రతిబింబింప జేయడానికి ప్రయత్నించాను కాని ఆ ఆశయాలే మా ఇద్దరినీ దూరం చేశాయి అందని ఆదర్శాలకు పోయి జానకిని పోగొట్టుకున్నానా?

ఆ వారంలోనే నాకు జానకి పెళ్ళి శుభలేఖ అందింది నన్ను వెక్కిరించడానికే జానకి నాకు ప్రత్యేకంగా ఒక శుభలేఖ పంపింది మరో వారంలో జానకి అత్తవారింటికి వెళ్ళి పోయింది—పిరికివారికి లోకంలో సుఖంలేదని చెప్పడానికా అన్నట్లు ★

---

(13వ పేజీ తరువాయి)

వేంద్రరావుగారే జవాబు చెప్పాలి మరి యిన్ని పరస్పర వైరుధ్య అభిప్రాయములను గమనించిన శారదగారు కృష్ణమూర్తి శాస్త్రిగారి విషయమున అటువంటి అభిప్రాయమును వ్యక్తీకరించుటలో తప్పేమున్నది

ఇక నలుగురిలోకి వచ్చి ఒక విషయమును ఇదమిత్థముగ తెల్పుటకు—కవిత్వము వ్రాయుటకు గల సంబంధము శ్రీ రావుగారికే తెలియాలి వారి కవితావ్యాప్తిని సన్మానాలుకాదు కొలచునది—సహృదయ లోకం! కనుక "సన్మానాలకు—కవిత్వమును వ్రాయుటకు—అసందిగ్ధముగ విషయమును చెప్పుటకు" వానిలో వానికిగల సంబంధ మేమిటో పాఠకులకు స్పష్టముగ శ్రీ రావుగారు జవాబుచెప్ప వలసి యుంటుంది

శారదగారు వసుంధరగారి 'సప్తవర్ణి'లోని "ద్వారమున' అన్న ప్రయోగమును ఏహ్యముగ నున్నదని విమర్శించి—'ద్వారా' అను వాడుక రూపమును సూచించిరి ఇందుకు సమాధానముగ శ్రీ రావుగారు "అసలు వసుంధరగారి ప్రయోగమే సబబని, వాడుక భాషను విశ్వవిద్యాలయం ఇంకా ఆమోదించలేదని శ్రీమతి శారదగారికి బాగా తెలును ననుకొంటాను' అని విశ్వవిద్యాలయపు గ్రాంధిక భాషా మమకారాన్ని-తన సమర్థనా చాకచక్యతను బుజువుపరచుకొనదలచి తాను 'బుజుగు'లో నిరుకుకొన్నారు పాపం! లేకపోతే ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు నిర్ణయించిన పాఠ్య పుస్తకాల్లో ఎన్నిచోట్ల 'ద్వారా' ప్రయోగాలు లేవని? మచ్చునకు - 1958లో పరీక్షకు బోవు 'ఇంటర్మీడియేటు' విద్యార్థులకు నిర్ణయించిన గద్య గ్రంధము శ్రీ పిల్లలమర్రి వేంకట హనుమంతరావు ఎం ఏ, గారి 'మాధురీ మహిమ', 87వ పుటలో పైనుండి క్రిందికి 17వ పంక్తిలో గల "....సంభాషణము ద్వారా పొందించి యుండుట" అన్న వాక్యము లోని వ్యావహారిక 'ద్వారా' ప్రయోగానికేమని సమాధానం చెప్పగలరు, శ్రీ రాఘువేంద్రరావుగారు వీరు తలంచినట్లు విశ్వవిద్యాలయంవారి గ్రాంధిక భాషా ప్రీతి ఏ గంగలో కలిసినట్లు?

ఇంతకూ కడపట శ్రీ రావుగారిచ్చిన ఆంగ్ల సలహా వాక్యమును, వారైనా జీర్ణించుకొనిరా యని సందేహము ఏమో! ★